సొంత భవనంలోకి రూరల్ ఠాణా
2





2
ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in

## బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ

**అక్షరటుడే, కామారెడ్డి:** సర్పంచ్ ఎన్నికల్లో బీసీలపై కాంగ్రెస్ కపట ప్రేమ చూపిస్తోందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోషి విమర్శించారు. ఈమేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. తాజాగా ఖరారు చేసిన రిజర్వేషన్లలో ఎస్సీ, ఎస్టీలకు పంచాయతీలు యథాతథంగా ఉండగా, బీసీలకు 22 శాతం రిజర్వేషన్ మాత్రమే అమలు చేస్తుండడం సరికాదన్నారు. ఇది బీసీలకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం 22 శాతం ఇచ్చి పబ్బం గడుపుకుంటోందని ఆరోపించారు.

25-11-2025
NIZAMABAD / KAMAREDDY
PAGES - 2



## ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి సన్నద్ధం కావాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో అధికారులు, సిబ్బంది క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రశాంత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు. నిఘా బృందాలను నియమించాలని, ఓటర్లను ప్రభావితం చేసే చర్యలను నిరోధించాలని, మద్యం, డబ్బు, వస్తువుల పంపిణీపై నిఘా ఉంచాలన్నారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామాగ్రిని జాగ్రత్తగా సరిచూసుకోవాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్, ఆర్మూర్ సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియా, జడ్పీ సీఈవో సాయా గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య ఘటన.. సిబ్బందిపై వేటు

**అక్షరటుడే, బాన్సువాడ:** చందూర్ మైనారిటీ గురుకుల సంక్షేమ పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. కాగా.. ఈ ఘటనపై స్పందించిన ఉన్నతాధికారులు హాస్టల్ సిబ్బందిపై మంగళవారం సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళ్తే.. చందూర్ మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల సంక్షేమ పాఠశాల హాస్టల్‌లో ఈనెల 23వ తేదీన విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హాస్టల్‌లో విద్యార్థులు, సిబ్బంది ఉన్నప్పటికీ విద్యార్థి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీంతో అధికారులు ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు.



## ప్రతిమండలంలో చేపల మార్కెట్

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ప్రతిమండలంలో చేపల మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ పేర్కొన్నారు. సదాశివనగర్ మండల కేంద్రంలోని పాత చెరువులో వందశాతం రాయితీతో చేపల పిల్లలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేపల మార్కెట్ కోసం ప్రతి మండల కేంద్రంలో వెయ్యి గజాలు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. తద్వారా చేపల అమ్మకం సులభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎల్లారెడ్డి మండలం మార్కెట్ యార్డు ప్రారంభమైందన్నారు. సదాశివనగర్‌లో నిర్మాణం దాదాపు పూర్తయిందన్నారు. లింగంపేట్ మండలంలో కూడా భూమిని గుర్తించినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

**పల్లె పోరుకు నగారా మోగింది. సర్పంచ్ ఎలక్షన్లకు నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో భాగంగా డిసెంబర్‌లో మూడు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మొత్తం 1,077 పంచాయతీలు ఉండగా.. 9,678 వార్డులు ఉన్నాయి. ఇప్పటికే రెండు జిల్లాల యంత్రాంగం ఎన్నికల ప్రక్రియకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. గ్రామ పంచాయతీలు, వార్డులకు రిజర్వేషన్లను సైతం ఖరారు చేశారు.** - అక్షరటుడే, ఇందూరు



# ఇక పల్లె పోరు..

- సర్పంచ్ ఎలక్షన్‌కు మోగిన నగారా
- షెడ్యూల్ విడుదల చేసిన ఈసీ
- మూడు విడతల్లో ఎన్నికలు
- ఇప్పటికే రిజర్వేషన్ల ఖరారు

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రాజకీయ సందడి మొదలైంది. పోటీకి నాయకులు సిద్ధమవుతున్నారు. పార్టీ జెండాలపై ఎలక్షన్లు జరగకపోయినా.. ప్రధాన పార్టీల నేతలు పోటీకి సన్నద్ధమవుతున్నారు. షెడ్యూల్ విడుదల కావడంతో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చింది.

### నిజామాబాద్ జిల్లాలో 545 జీపీలు

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 545 గ్రామపంచాయతీలు, 5022 వార్డులు ఉన్నాయి. రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను ఖరారు చేశారు. వీటిని జిల్లా యంత్రాంగం అధికారికంగా ప్రకటించింది. మొత్తం 545 పంచాయతీల్లో జనరల్‌కు 242, ఎస్టీలకు 96, ఎస్సీలకు 82, బీసీలకు 125 కేటాయించారు. ఇందులో మహిళలకు 113 స్థానాలను ఖరారు చేశారు. అలాగే మొత్తం 5022 వార్డు స్థానాల్లో జనరల్ 2,271, ఎస్టీ 836, ఎస్సీ 808, బీసీలకు 1,107 స్థానాలను కేటాయించారు. ఇందులో మహిళలు 1,050 వార్డు స్థానాలను ఖరారు చేశారు.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో మొత్తం 532 గ్రామ పంచాయతీలు, 4,656 వార్డులు ఉన్నాయి. జీపీల్లో జనరల్‌కు 240, బీసీలకు 123, ఎస్టీ 90, ఎస్సీలకు 79 కేటాయించారు. అలాగే వార్డులకు సంబంధించి జనరల్ 2,085, బీసీ 1,117, ఎస్సీ 732, ఎస్టీలకు 722 కేటాయించారు. ఇక మహిళలకు సంబంధించి 532 పంచాయతీల్లో 242 స్థానాలు, వార్డు మెంబర్లుగా 1,995 స్థానాలు కేటాయించారు.

### పెరిగిన స్థానాలు..

గతంతో పోల్చితే జిల్లాలో గ్రామపంచాయతీ స్థానాలు పెరిగాయి. 2019 ఎన్నికల్లో జిల్లాలో 530 గ్రామపంచాయతీలు ఉంటే.. ప్రస్తుతం అదనంగా మరో 15 పెరిగాయి. దీంతో రిజర్వేషన్ కేటాయింపుల్లో జనరల్‌తో పాటు బీసీల స్థానాలు కూడా పెరిగాయి. గత ఎన్నికల్లో జనరల్‌కు 229 ఉండగా.. ఈ సారి 242, బీసీలకు 98 ఉండగా.. ప్రస్తుతం 125కు పెరిగింది. ఇది ఇలా ఉండగా ఎస్సీ, ఎస్టీ స్థానాలు తగ్గాయి.

### మూడు విడతల్లో..

పంచాయతీ ఎన్నికలకు డిసెంబర్‌లో మూడు విడతల్లో పోలింగ్ జరగనుంది. 11, 14, 17వ తేదీల్లో పోలింగ్ ఉంటుంది. తొలి విడత నామినేషన్ల ప్రక్రియ నవంబర్ 27 నుంచి ఉంటుంది. ఓటింగ్ డిసెంబర్ 11న జరుగుతుంది. రెండో విడత నామినేషన్లు నవంబర్ 30 నుంచి ఉంటుంది. పోలింగ్ 14వ జరుగుతుంది. మూడో విడత నామినేషన్ల ప్రక్రియ డిసెంబర్ 3 నుంచి ఉంటుంది. నవంబర్ 17న ఓటింగ్ జరుగుతుంది. ఇక పోలింగ్ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సాగుతుంది. మధ్యాహ్నం 2 గంటల త్వరాత కౌంటింగ్ ప్రారంభం అవుతుంది. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**అక్షరటుడే, ఆర్మూర్:** వేల్పూర్ మండలంలోని రామన్నపేట్ గ్రామానికి చెందిన 1994-95 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. సుంకెట్ రోడ్డులో ఉన్న మొటాటిరెడ్డి కల్యాణ మండపంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు రామోజీ రాములు (రామన్నపేట్), మగ్గిడి శంకర్ (మోర్తాడ్), ఆర్.శివాజీ(బోధన్)లను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రేగుల్ల మంజుల, నాగలత, శ్యామల, విజయలక్ష్మి, సాయమ్మ, పిట్ల గణేశ్, శోభన్ రెడ్డి, రవి, మోహన్ రెడ్డి, రమేశ్, మహేశ్, రాజా రమేశ్, సుదాం రెడ్డి, తీగల సంతోష్, కుంట శ్రీనివాస్, నరేశ్ పాల్గొన్నారు.

## బాన్సువాడ – కామారెడ్డి మధ్య డీలక్స్ సర్వీసులు ప్రారంభం

**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రయాణికుల సౌకర్యార్థం బాన్సువాడ నుంచి కామారెడ్డి వరకు కొత్తగా డీలక్స్ బస్సు సర్వీసులను ప్రారంభిస్తున్నట్లు బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్ రవి కుమార్ తెలిపారు. ప్రతి రోజుకు నాలుగు సార్లు బాన్సువాడ, కామారెడ్డి మధ్య బస్సులు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. బాన్సువాడ నుంచి కామారెడ్డికి ఉదయం 5.15, 9గంటలకు, మధ్యాహ్నం 12.45, సాయంత్రం 4.15 బయలుదేరుతాయని డీఎం తెలిపారు. కామారెడ్డి నుంచి ఉదయం 7.15 గంటలకు, 10.45 గంటలకు, మధ్యాహ్నం 2.15కు, సాయంత్రం 6 గంటలకు బయలుదేరుతుందని మేనేజర్ పేర్కొన్నారు.

## సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు: డీసీపీ బస్వారెడ్డి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సమాజంలో వరకట్న వేధింపులు తగ్గినప్పటికీ.. సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని డీసీపీ బస్వారెడ్డి అన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో చిక్కకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతర్జాతీయ మహిళా హింస వ్యతిరేక దినోత్సవాన్ని న్యూ అంబేద్కర్ భవన్‌లో మహిళా సంక్షేమ శాఖ, సఖి సెంటర్, స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ సోషల్ మీడియా వాడడం వల్ల తమ వ్యక్తిగత విషయాలు, ఫొటోలను సైతం బయటకు వెళ్తాయన్నారు. వీటిని సైబర్ నేరగాళ్లు మార్ఫింగ్ చేస్తూ వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ, శ్రీలత, జీజీహెచ్ గైనకాలజిస్ట్ అరుణ రేఖ, సఖి వన్‌స్టాప్ సెంటర్, సెంటర్ అడ్మినిస్ట్రేటర్ భానుప్రియ పాల్గొన్నారు.

## చిరుత సంచారంతో భయాందోళన

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మంగళవారం చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామానికి చెందిన రవీందర్, సురేందర్‌కు చెందిన మేకల మందపై చిరుత దాడి చేయడంతో మూడు మేకలు మృతిచెందాయి. దీంతో బాధితులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు. ఈ ఘటనతో పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు.




## వడ్డీలేని రుణాలతో మహిళలకు ఆర్థిక స్వావలంబన

**అక్షరటుడే, ఆర్మూర్:** మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు వడ్డీ రాయితీలను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వడ్డీలేని రుణాలను అర్హులైన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సంఘాల జిల్లా అధికారిణి సంధ్యారాణి మాట్లాడుతూ.. మహిళలు తీసుకున్న రుణాలకు వడ్డీ రాయితీని అందించడం జరిగిందన్నారు. ఒక సంఘం రూ.20 లక్షల రుణం తీసుకుంటే రూ.5 లక్షల వరకు రాయితీ వస్తుందని తెలిపారు. మొత్తం జిల్లాలో 19,026 సంఘాలకు రూ.23.25 కోట్ల రాయితీ మంజూరైందని ఆయన పేర్కొన్నారు. ఆర్మూర్ నియోజకవర్గంలో 3,180 సంఘాలకు రూ. 3.25 కోట్ల వడ్డీ రాయితీని పంపిణీ చేయడం జరిగిందన్నారు. సంఘ సభ్యులు లోన్ పూర్తిగా కడితే వారి ఖాతాలో డబ్బులు నేరుగా జమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మహిళా సంఘాల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

**అక్షరటుడే, కామారెడ్డి:** రాష్ట్రంలో మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు ప్రభుత్వం అందజేస్తోందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ తెలిపారు. భిక్కనూరులో మంగళవారం నిర్వహించిన వడ్డీలేని రుణాల పంపిణీ కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి షబ్బీర్ అలీ పాల్గొన్నారు. కామారెడ్డి నియోజకవర్గానికి సంబంధించి రూ.3.25 కోట్ల వడ్డీలేని రాయితీలకు సంబంధించిన చెక్కులను, ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండుసార్లు వడ్డీ లేని రుణాలను ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మహిళలను కోటీశ్వరులుగా చేస్తామని మాటిచ్చామని, ఇప్పుడు నిరూపిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలను వారి కాళ్ల మీద వారిని నిలబడేలా తీర్చిదిద్ది కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు దృఢ సంకల్పంతో ఉన్నామని తెలిపారు.





## మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**అక్షరటుడే, బాన్సువాడ :** గ్రామీణ ప్రజలు, రైతులు, మత్స్యకారులకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని చందూర్ మండల పరిధిలో మంగళవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజ్‌తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలు, ప్రారంభోత్సవాలు చేశారు. చందూర్ చెరువులో ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. చేపల పెంపకదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని వివరించారు. మేడిపల్లి గ్రామంలో రూ.11 లక్షలతో నిర్మించిన సొసైటీ గోదాంను ప్రారంభించారు. అనంతరం లక్ష్మాపూర్ గ్రామంలో రూ. 30 లక్షలతో నిర్మించిన సొసైటీ సబ్‌సెంటర్ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు. చందూర్ మండల మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. సంక్షేమ పథకాలు ప్రతి అర్హులకు చేరేలా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కార్యక్రమాల్లో చందూర్, మోస్రా, వర్ని మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## విద్యుత్‌శాఖ పోతంగల్ ఏఈగా రాజేష్

**అక్షరటుడే, కోటగిరి :** విద్యుత్‌శాఖ పోతంగల్ మండల ఏఈగా యార్లగడ్డ రాజేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో బోధన్‌లో పనిచేసిన ఆయన ప్రమోషన్‌పై పోతంగల్‌కు వచ్చారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సిబ్బంది, కొత్త ఏఈకి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందిస్తానన్నారు. కార్యక్ర మంలో 1104 డివిజనల్ సెక్రెటరీ శివప్రసాద్, సబ్ ఇంజినీర్ ఫక్రుద్దీన్, ఏఈ మారు తి, ఎల్ఐ సత్యనారాయణ, లైన్‌మన్ గణేశ్, ఖదీర్, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు, జ్ఞానేశ్వర్, మనోహర్, సాజిత్, రాజు, సిరాజ్ పాల్గొన్నారు.

## లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి



**అక్షరటుడే, ముప్కాల్:** లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని జిల్లా ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘ అధ్యక్షుడు గాండ్ల రాంచందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ముప్కాల్‌లో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయక్‌పోడ్ కులస్థులకు ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో జరుగుతున్న అన్యాయంపై చర్చించారు. ముందుగా లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గంగ సాయన్న, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లోలం గంగాధర్, సభ్యులు కంచు సతీష్, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు శివశంకర్, మండలాల అధ్యక్షులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం గగ్గుపల్లిలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో కొండి గంగాధర్, మంతెన పద్మారావు, ఆకాష్, శెట్టి ధర్మపురి, ప్రభాకర్, శశి, సాయన్న, పెద్ద రాజన్న, శంకర్, సురేష్, డేవిడ్, సూరజ్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చొరవతో స్వదేశానికి చేరిన యువకుడు



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** కువైట్‌కు వెళ్లిన యువకుడు అక్కడ తప్పిపోగా ప్రభుత్వం తీసుకున్న చొరవతో తిరిగి స్వదేశానికి చేరాడు. వివరాల్లోకి వెళ్తే.. కమ్మర్‌పల్లి మండలం హాసా కొత్తూర్ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు ఈశ్వర్ 30 రోజులుగా కువైట్‌లో ఆచూకీ లేకుండా పోయాడు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సునీల్‌రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ నాయకుడు పడిగల ప్రవీణ్ బాధిత కుటుంబ సభ్యులను హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ ప్రవాసి ప్రజావాణిలో ఇన్‌ఛార్జీగా ఉన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ ఛైర్మన్ చిన్నారెడ్డి, రాష్ట్ర గల్ఫ్ అడ్వైజర్ కమిటీ వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డికి విన్నవించారు. దీంతో స్పందించిన వారు.. కువైట్‌లోని భారత దేశ ఎంబసీ అధికారులతో మాట్లాడారు. అక్కడ పోలీసుల చెరలో ఉన్న ఈశ్వర్‌ను విడిపించి స్వదేశానికి తీసుకొచ్చారు.

## కమ్మర్‌పల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలకేంద్రంలో పలు అభివృద్ధి పనులను ఏఎంసీ వైస్ ఛైర్మన్ సుంకేట బుచ్చన్న, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుంకెట రవి ప్రారంభించారు. ఎంఆర్సీ ఆఫీస్ రోడ్డు, ఉప్లూర్ రోడ్డు నుంచి గౌడ సంఘం రోడ్డు, మినీస్టేడియం రోడ్డు, శ్మశానం రోడ్డు, గొల్లపేట కాలనీ సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌కు, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సల్లూరి గణేష్, సింగిరెడ్డి శేఖర్, కౌడ శైలేందర్, వేములవాడ జగదీష్, అల్లోట్ రంజిత్, కిషన్, సంపంగి నాగరాజు, పడాల గంగాధర్, ఎడ్ల దీపక్ సాయి, నరేష్ పాల్గొన్నారు.





# సొంత భవనంలోకి రూరల్ పోలీస్ స్టేషన్

▸ నిర్మాణ పనులు పూర్తి ▸ ఇప్పటికే ఠాణాను అప్‌గ్రేడ్ చేసిన సీపీ

**నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు నూతన భవనం సిద్ధమైంది. దీంతో ఠాణా పాత భవనం నుంచి కొత్త బిల్డింగ్ లోకి మారింది. బుధవారం నుంచి కొత్త భవనంలో కార్యకలాపాలు ప్రారంభించనున్నారు.**

**– అక్షరటుడే నిజామాబాద్ సిటీ**

రూరల్ పోలీస్ స్టేషన్ ప్రస్తుతం నిజామాబాద్‌లోని కేసీఆర్ కాలనీలో కొనసాగుతోంది. నూతన భవనాన్ని కంఠేశ్వర్ ప్రాంతంలో నిర్మించారు. అయితే అధికారికంగా భవనాన్ని ప్రారంభించకపోయినప్పటికీ.. కొత్త భవనంలో కార్యకలాపాలు నిర్వహించనున్నారు.

### బీఆర్ఎస్ హయాంలో శంకుస్థాపన

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం కేసీఆర్ నిజామాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు నిధులు మంజూరు చేశారు. 2016లో భవన నిర్మాణానికి అనుమతులు లభించాయి. అలాగే రూ.కోటి నిధులు సైతం మంజూరు అయ్యాయి. 2018లో కంఠేశ్వర్ ప్రాంతంలో అప్పటి ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. నిధులు మంజూరైనప్పటికీ విడుదల ఆలస్యం కావడంతో భవన నిర్మాణ పనులు నెమ్మదించాయి. ఎట్టకేలకు పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధమైంది.

### అప్‌గ్రేడ్ అయిన పోలీస్‌స్టేషన్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఇటీవలే రూరల్ పోలీస్ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేశారు. జనాభా దృష్ట్యా ఎస్సై గ్రేడ్ నుంచి సీఐ గ్రేడ్‌కు అప్‌గ్రేడ్ అయ్యింది. ప్రస్తుతం నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా సీహెచ్ శ్రీనివాస్ కొనసాగుతున్నారు. అధికారికంగా భవనాన్ని ప్రారంభించక పోయినప్పటికీ.. బుధవారం నుంచి కొత్త భవనంలోనే పోలీస్ అధికారులు విధులు కొనసాగించనున్నారు.

## ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి

**అక్షరటుడే, బాన్సువాడ:** ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని బాన్సువాడ సీఐ తుల శ్రీధర్ సూచించారు. బుధవారం ఆయన ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపార సముదాయాలను సందర్శించి, వ్యాపార యజమానులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రోడ్డు మీదకు దుకాణాలను విస్తరించడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోందన్నారు. ఇలాంటి చర్యలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రోడ్డు ఆక్రమణలు ట్రాఫిక్ సమస్యలకు కారణమవుతున్నందున యజమానులు వెంటనే వాటిని తొలగించాలని సూచించారు. ప్రజల సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించాలని సీఐ కోరారు.






## రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీకి బాల్కొండ విద్యార్థి

**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్ తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి హర్షిత్ అండర్-14 రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయని వ్యాయామ ఉపాధ్యాయుడు ముత్తెన్న తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, పీఈటీ ముత్తెన్న, ఉపాధ్యాయులు గణేష్, సుకుమార్, విజయలక్ష్మి, శ్రావణి, శ్రీనివాస్, శ్రీకాంత్, రవి అభినందించారు.



## ధ్వజారోహణం కార్యక్రమాన్ని వీక్షించిన ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఆర్మూర్:** అయోధ్యలో ప్రధాని మోదీ చేతుల మీదుగా రామాలయ ధ్వజారోహణం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ నేపథ్యంలో బీజేపీ సీనియర్ నాయకులతో కలసి అంకాపూర్‌లో తన నివాసంలో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి టీవీలో ఈ కార్యక్రమాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కలిగోట గంగాధర్, పోల్కం వేణు, పెంటయ్య, ఆలూరు సుభాష్ పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విద్యార్థినుల ఎంపిక



**అక్షరటుడే గాంధారి:** రాష్ట్రస్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు పేట్ సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థినులు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కుమార స్వామి తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 24న జరిగిన పోటీల్లో ప్రతిభ చూపి దివ్యశ్రీ, దీపిక, అమ్ములు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. నవంబర్ 26 నుంచి 28 వరకు పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినులు పాల్గొననున్నట్లు వారు తెలిపారు. విద్యార్థినులను వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు.

## గంగపుత్రుల ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి



**అక్షరటుడే, ఆర్మూర్ :** గంగపుత్రుల ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఆలూరు మండల కేంద్రంలోని అన్ని గ్రామాలకు వందశాతం సబ్సిడీపై చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. చేపల పెంపకం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు, యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. గ్రామాల చెరువుల్లో చేపపిల్లలను వదిలి ఉత్పాదకతను పెంచేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వైస్ మల్లారెడ్డి, కాంగ్రెస్ ఆలూర్ మండల అధ్యక్షుడు ముక్కెర విజయ, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ అరుణ్, ఓబీసీ అధ్యక్షుడు నాడీశరం మల్లయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు సంజీవ్, చిరంజీవి, నాయకులు కిషన్, ఎల్ఐసీ గంగన్న, గంగారాం, ఒడ్డెన్న, పోశెట్టి, ఫీల్డ్ ఆఫీసర్ జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన పలువురికి జైలుశిక్ష

**అక్షరటుడే, నిజామాబాద్‌సిటీ/ఆర్మూర్/బాల్కొండ :** డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన పలువురికి జైలుశిక్ష పడింది. నిజామాబాద్ నగరంతో పాటు ఆర్మూర్‌లో న్యాయస్థానాల్లో మంగళవారం న్యాయమూర్తులు జైలుశిక్షతో పాటు భారీగా జరిమానాలు విధించారు. నిజామాబాద్ ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో పలుచోట్ల డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మొత్తం 35 మంది మద్యం సేవించి వాహనాలు నడిపినట్లు గుర్తించారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. విచారించిన న్యాయమూర్తి 17 మందికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారు. అలాగే ఒకరికి రూ.11,000 జరిమానా విధించారు. మరో ఏడుగురికి వారం రోజుల పాటు జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇక ఆర్మూర్‌లో ఐదుగురికి జరిమానా విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన ఐదుగురిని ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చామన్నారు. విచారించిన న్యాయమూర్తి ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున న్యాయమూర్తి గంగాధర్ జరిమానా విధించారని తెలిపారు. అంతేకాకుండా బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై శైలేందర్ తెలిపారు. మండల పరిధిలో తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతున్నట్లుగా గుర్తించి అతడిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా అతడికి రూ.పదివేల జరిమానా విధించారని ఆయన చెప్పారు.



## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఇందల్వాయి:** సిరికొండ మండలం కొండాపూర్‌లో లబ్ధిదారులకు మంగళవారం సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి వెల్మ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో చెక్కులను అందించారు. దోన్‌పల్లి బుచ్చవ్వ రూ.18వేలు, మోత్కూరి నిహారిక రూ.18వేలు, గున్నాల బాలాగౌడ్ రూ.9వేలు, ఆవునూరి నర్సాగౌడ్ రూ.20వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి పథకం వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నల్ల బుచ్చన్న, చంద్రాగౌడ్, శ్రీధర్, గౌషొద్దీన్ ఆకుల శీను, రాజేశ్వర్, రాజు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




## ఆలూర్ మండలం కల్లడిలో..

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని కల్లడి గ్రామానికి చెందిన బండారి రాజశేఖర్, అంకాపురం గంగాధర్ ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందారు. సీఎంఆర్‌ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకోగా.. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి చొరవతో చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం బండారి రాజశేఖర్‌కు రూ.12వేలు, అంకాపురం గంగాధర్‌కు రూ.60వేల చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు నీలగిరి శ్రీనివాస్, ఆలూరు మండల యూత్ ప్రెసిడెంట్ సిరికొండ మహేష్, ధర్మయ్య, నర్సారెడ్డి, శ్రీను, భాస్కర్, సాయి, శివ, ధర్మన్న చిన్న బోరన్న బాలరాజు, రాజశేఖర్ పాల్గొన్నారు.

## 26న బీఆర్ఎస్ సన్నాహక సమావేశం

**అక్షరటుడే, ఆర్మూర్:** జిల్లాలో ఈనెల 29న నిర్వహించనున్న దీక్ష దివస్‌ను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 26న సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. తెలంగాణ చరిత్రలో నిలిచిపోయే రోజు నవంబర్ 29 అని జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

## గుండెపోటుతో సీపీఐ నేత మృతి



**అక్షరటుడే, కామారెడ్డి :** సీపీఐ సీనియర్ నాయకుడు వీఎల్ నర్సింహారెడ్డి సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గత కొద్దిరోజులుగా నర్సింహారెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం కామారెడ్డి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనను మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు.